**హౌవ్‌**రానుంచి హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైల్లోని వో లేడీస్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కాడు సూర్యం డోర్నకల్ స్టేషన్‌లో, ప్రయాణీకుల టిక్కెట్లు తణిఖీ చేయడానికి. అంతకు ముందే రెండు కంపార్ట్‌మెంట్స్ తణిఖీ చేయడం పూర్తిచేసి ఆ మూడో పెట్టె లోకి ఎక్కాడు సూర్యం.

పేరుకి స్త్రీలకోసం ప్రత్యేకింపబడ్డ సెకండ్‌క్లాస్ (పూర్వం థర్డ్‌క్లాస్) పెట్టె అయినా, దాంట్లో సగానికిపైగా మొగవాళ్లు ప్రయాణం చేస్తున్నారు. సూర్యం ఒక్కొక్కళ్ల దగ్గరకే వెళ్ళి, టిక్కెట్ అడిగి తీసుకుని, దానిమీద తన నీలంరంగు పెన్సిల్‌తో సంతకం చేస్తున్నాడు. చేసి, తిరిగి ఎవరిటిక్కెట్లు వాళ్లకి ఇచ్చేస్తున్నాడు.

శనివారం అవటంవల్ల, వరసగా నాలుగు రోజులు పబ్లిక్‌హాలీడేస్ రావటంవల్ల, ఎండా కాలం అవటంవల్ల ఆ హౌరా—హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బాగా రద్దీగావుంది. మనిషి కాలు కదిపేందుకు కూడా చోటులేనంతగా ఆక్రమించుకున్నారు ఆ కంపార్ట్‌మెంట్‌ని. ఆఖరికి, టాయ్‌లెట్ తలుపు తెరచి, దాన్లోపలకూడా అయిదారుగురు కూర్చున్నారు, వేరేఎక్కడా చోటులేక.

రైలు అంతరద్దీగా వుంటుందన్నసంగతి తెలిసే, స్పెషల్‌స్క్వాడ్‌కి చెందిన సూర్యాన్ని, మరికొందరిని చెకింగ్ డ్యూటీకి పంపారు అధికారులు. టిక్కెట్‌లేకుండా ప్రయాణం చేసేవాళ్ళు చాలామంది దొరుకుతారు అలాంటి సందర్భాలలో. అందుకే సూర్యం జాగ్రత్తగా తణిఖీచేస్తున్నాడు, వేగంగావెళ్తున్న ఆరైల్లో.

# జరిమానా



మల్లాది వెంకట కృష్ణమూర్తి

వెలుగుపడనిచోట, ఓ మూలగా ఎత్తుగా వున్న రేకుపెట్టెమీద కూర్చొనివున్న ఓ అరవైఅయిదేళ్ల ముసలావిడదగ్గర ఆగి, అడిగాడు సూర్యం, ఆవిడ వంక చూడకుండానే, మరొకరి టిక్కెట్ తణిఖీచేస్తూ.

"మీ టిక్కెట్ తీయండమ్మా."

తనుచూస్తున్న టిక్కెట్‌మీద సంతకం చేసి, తిరిగిచ్చేసి, మళ్లీ అడిగాడు సూర్యం ఆ ముసలావిడని.

"మీ టిక్కెట్ ?"

"లేదు." వణుకుతున్న స్వరంతో జవాబిచ్చింది ఆ ముసలావిడ సూర్యానికి.

"ఎక్కడెక్కారు ? ఎంతదాకా ?" సూర్యం కంఠం అలవాటుగా పలికింది డబాయింపుగా.

"విజయవాడ, వరంగల్ దాకా."

"టిక్కెట్ కొనలేదా ? పోయిందా ?"

"కొనలేదు"

"అయితే ఇప్పుడు కొనండి. రసీదు రాసిస్తాను. పదిరూపాయలు జరిమానాకూడా కట్టాలి"

"డబ్బులేదు" నూతిలోంచి వచ్చినట్లుగా వుంది ఆ ముసలావిడ స్వరం.

ఏదో అనబోయి సూర్యంఆగి, ఆవిడవంక కొద్దిగా పరిశీలనగా చూశాడు. ఓసారి చేత్తో ముక్కుని పిండుకున్నాడు ఆలోచనగా. మళ్ళీ ఇంకోసారి ఆవిడని తేరిపారచూసి అడిగాడు, గొంతుతగ్గించి నెమ్మదిగా.

"మీది బందరు కదూ ?"

"అవును" జవాబు చెప్పిందావిడ.

"బందరునుంచి కట్టాలా ? నాదగ్గిర చిల్లిగవ్వలేదు. వరంగల్‌లో మా అబ్బాయి దగ్గరకి వెళ్తున్నాను."

"మీ పేరు వర్ధనమ్మగారు కదా?" అడిగాడు.

"అవును. నన్నెరుగుదువా ?" ఆవిడ ప్రశ్నలో విభ్రాంతి, సంకోచం, కొద్దిపాటి సంతోషం–కలిసిపోయాయి.

"నేను సూర్యమండి. సూరిగాడనే వారు మీరు. ఎస్సెసెల్సీ చదివేరోజుల్లో మీయింట్లో అద్దెకుండే వాళ్లం" సంతోషంగా చెప్పాడు సూర్యం వర్ధనమ్మతో.

– ఆవిడ ఏదో వెదుకుతున్నట్లుగా సూర్యం వంక చూసి అన్నది కొద్దిగా బాధగా. "ఈమధ్య కళ్ళు మసక బారాయి. ఆనటంలేదు చూపు సరిగా. సూరిగాడివా నువ్వు ? అవును ఆమధ్య మీనాన్న కనబడి చెప్పాడు నువ్వు రైళ్లమీద తిరిగే వుద్యోగంలో చేరావని."

"టిక్కెట్ కొనలేదే ?" ఈసారి వీలయినంత మృదువుగా అడిగాడు సూర్యం వర్ధనమ్మని.

పెద్దగా నిట్టూర్చి అన్నది "డబ్బులేక"

"మీఇల్లు ? ఇంటిమీద వచ్చే అద్దెలు ?" ఆశ్చర్యంగా అడిగాడు సూర్యం.

"ఆడదాని పెత్తనంతో ఆస్తి ఎంతకాలం నిలుస్తుంది ? వుండటమేకాని, ఎవరూ అద్దె సరిగా ఇచ్చిన పాపాన పోలేదు. ఇప్పుడు ఆ ఇల్లుకూడా మా పినతండ్రి అధీనంలో వుంది. పోట్లాడే ఓపిక వయసు లేవు ఇప్పుడు."

సూర్యం కొద్దిగా బాధగా అన్నాడు.

"మేం వున్నప్పుడు కూడా ఘనాపాటి అద్దె ఇవ్వకుండా మిమ్మల్ని ఏడిపించేవాడు. మానాన్న కలుగచేసుకుని ఇప్పిస్తే సరేసరి. లేకపోతే ఇచ్చేవాడుకాడు ఆరోజుల్లో."

రెండు వందల పైనే ఎగ్గొట్టి వెళ్లిపోయాడు ఆచచ్చినాడు. పోతూ పోతూ, కిటికీ తలుపులు, ఇంటి తలుపులు పీక్కుపోయాడు, రాత్రికి రాత్రే దొంగతనంగా; లాయర్‌చేత కాగితం ఇప్పించాననే కోపంలో."

"మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు వరంగల్‌లో ?" అడిగాడు సూర్యం.

"ఓ బస్ కంపెనీలో డ్రయివర్‌గా పని చేస్తున్నాడు: వాడుకూడా సరిగా చూడడు. కోడలు మంచిది కాకపోతే వాణ్ణని ఏంలాభం? నారాత ఇలాక్కాలబట్టే ఇంకా బతికున్నాను"

సూర్యం తన కాకీపేంట్‌జేబులోంచి చేతిరుమాలు తీసి, ముఖం ఓసారి తుడుచుకున్నాడు. చేతిలో తెరచి పట్టుకున్న రసీదు పుస్తకాన్ని మూసేసి అన్నాడు వర్ధనమ్మతో.

"మిమ్మల్ని వరంగల్‌లో కలుస్తాను స్టేషన్‌లో. టిక్కెట్ లేకపోతే బయటకి పంపడం కష్టం. ఈరోజు ప్రత్యేకంగా చాలా మందిని వేసారు అయినా ప్రయత్నిస్తాను. వరంగల్‌లో నాకంతా కొత్త."

వర్ధనమ్మ చెయ్యెత్తి దణ్ణం పెట్టి అన్నది.

"నీ దయ బాబూ."

సూర్యం కళ్ళు కొద్దిగా చెమ్మగిల్లాయి. పదిహేనేళ్ల క్రితం వర్ధనమ్మ ఎంత దర్జాగా బతికేది ? కాలం మనిషిలో, అదృష్టంలో ఎంత మార్పు తీసుకువస్తుంది ?

ముందుకు కదిలాడు వరంగల్ స్టేషన్‌లో తనకి పరిచయం వున్నవాళ్లు ఎవరయినా గేటుదగ్గర వుంటే బావుండుననుకుంటూ

అయిదారుగురి దగ్గర చెక్ చేసాడు. మూడేళ్లు నిండిన పిల్లాడికి టిక్కెట్ కొనలేదు. ఓ తండ్రి. తన పిల్లవాడికి మూడేళ్లు నిండలేదని వాదించాడు: ఇలాంటి వాదనలు అలవాటే కాబట్టి సూర్యం గట్టిగా చెప్పాడు.

"ఫైన్‌తోసహా టిక్కట్టు కొనకపోతే స్టేషన్‌లోంచి ఎలా బయటకి వెళ్తారో చూస్తాను. కోర్టులో చెప్పుకుందురు గాని మేజిస్ట్రేట్ ముందు."

వెంటనే చల్లబడిపోయి డబ్బు బయటకి తీసాడు సణుగుతూ. రసీదు రాసిచ్చి, డబ్బు తీసుకున్నాడు సూర్యం.

"మీ టిక్కెట్స్" అడిగాడు కొంచెం దూరంలో కూర్చున్న వాళ్లని.

అయిదుగురు స్టూడెంట్స్, ముగ్గురు కోడి గుడ్లు వ్యాపారం చేసుకునే వాళ్ళు టిక్కెట్లు అందించారు సూర్యానికి. ఇద్దరు పిల్లలతో ప్రయాణంచేస్తున్న ఓ ఏభై ఏళ్ల తను తన టిక్కెట్లు భార్య హేండ్‌బేగ్ లోంచి తీసి అందించాడు తాపీగా.

సూర్యం అన్నిటిక్కెట్ల మీద సంతకాలు చేసి ఎవరివి వాళ్లకి అందించాడు, ఒక్క ఆ ఏభై ఏళ్ల వ్యక్తికి తప్ప.

"ఎంతమంది మీరు?" అడిగాడు సూర్యం తన చేతిలోని టిక్కెట్లు లెక్క పెట్టి, వాళ్ల కుటుంబ సభ్యులని లెక్క వేస్తూ



"నలుగురం" చెప్పాడు ఆ ఆసామి.

సూర్యం తన చేతిలోని టిక్కెట్లని మరో సారి లెక్కపెట్టి అన్నాడు.

"ఒక టిక్కెట్ తక్కువ కొన్నారే?"

"తక్కువా? నాలుగూ ఇచ్చానే" అన్నాడతనుకంగారుగా.

"మీరే చూడండి"

తన చేతిలోని టిక్కెట్లని ఆ ఆసామి చేతిలో వుంచాడు సూర్యం. ఆయన లెక్కపెట్టాడు. మూడే వున్నాయి. సూర్యం నేల మీదకి చూసాడు వంగి, కిందపడి వుండచ్చని. నేలమీద లేవు.

"నాలుగూ ఇచ్చానే" అన్నాడా ఆసామీ సందిగ్ధంగా.


"ఇస్తే ఏమవుతుంది. చూడండిసరిగ్గా" అసహనంగా అన్నాడు సూర్యం.

తన భార్య హేండ్‌బేగ్ అందుకుని గబగబా లోపలి వస్తువులన్నీ తన సీట్ మీద బోర్లించాడు. టిక్కెట్‌తప్ప చాలా వస్తువులు పడ్డాయి. సీటుమీద పరిచివున్న తువ్వాలమీద. ఖాళీ హేండ్ బేగ్‌లో చేతినిపెట్టి వెదికాడు. తన జేబులు వెదుక్కున్నాడు.

"టిక్కెట్స్ బయటకి తీసావా మధ్యలో ఎక్కడయినా?" అడిగాడు భార్యని.

ఆవిడతల అడ్డంగా వూపింది.

"నాలుగూ కొని నీ హ్యాండ్ బేగ్‌లోనే వేసానే? కొంపతీసి ఇందాక మీరు టీ తాగినప్పుడు డబ్బులివ్వడానికి హేండ్‌బేగ్ తెరిచినప్పుడు జారిపడిపోయిందేమో" అన్నాడాయన




# జరిమానా

ఆదుర్దాగా. ఆవిడ వెంటనే ఒడి దులుపుకొని అన్నది.

"ఉహు. పడివుంటే నా ఒళ్ళోనే పడాలి. మీరు నాలుగూ కొన్నారా?" అనుమానంగా అడిగింది.

"నీ మొహం ఈడ్చు, ఎక్కడో నువ్వే పారేసావు" కోపంగా అరిచాడా ఆసామి భార్య మీద మండిపడుతూ.

సూర్యం కిటికీలోంచి బయట కనబడుతున్న చీకటివంక చూస్తూ అంతదాకా శ్రోత అయ్యాడు వాళ్లిద్దరికీ.

"నాలుగు కొనలేదా?" అడిగాడు ఖంగున.

"కొన్నాను. నా భార్య ఎక్కడోపడేసింది"

"లేదు. మీరు తీసుకునేటప్పుడే నాలుగు బదులు మూడు తీసుకుని వుంటారు" అన్నదావిడ తన అహం దెబ్బ తిన్నట్లుగ.

"సరిగ్గా చూడండి" అన్నాడు సూర్యం విసుగ్గా.

మళ్లీ మరోసారి వెదికి నిస్పృహగా అన్నాడు ఆ ఆసామి సూర్యంతో.

"మా ఆవిడ ఎక్కడో పారేసింది"

సూర్యం తనచేతిలోని బేగ్‌లోంచి ఓ అచ్చు పుస్తకం బయటికి తీసాడు, 'రైల్వే ఫేర్స్‌రెడీ రికనర్' అది

"మీరు డబ్బు కట్టాలయితే" అన్నాడు ఆ పుస్తకంలో ఎంత కట్టాలో చూస్తూ.

"నిజంగా నాలుగూ కొన్నాను. మూడు కొన్నవాణ్ణి నాలుగు కొనలేనా?" ఆ ఆసామి అరిచాడు కోపంగా సూర్యంమీద.

"నేను కొనలేదంటాను" సూర్యం సౌమ్యంగా అన్నాడు.

"కొన్నాను" వత్తిపలికాడాయన.

"కొనలేదు" ఇంకా సౌమ్యంగా పలికాడు సూర్యం.

"నిజంగా కొన్నాను. నాలుగు టిక్కెట్లకి డబ్బిచ్చాను."

"మరో నాలుగు టిక్కెట్లకి డబ్బిచ్చానంటే సరిపోదు. అలా ఇచ్చారనడానికి నిదర్శనమే టిక్కెట్. టిక్కెట్ వుంటే చూపించండి. లేకపోతే ముప్పైఆరు రూపాయల చిల్లర బయటికి తీయండి" కర్కశంగా అన్నాడు సూర్యం.

"దేనికి ముప్పైఆరూ? ఇరవైఆరేగా? అయినా మళ్లీ దేనికి టిక్కెట్ చార్జీకట్టాలి నేను?" గొంతు పెద్దదిచేశాడాయన లేస్తూ.

శాంతంగా చెప్పాడు సూర్యం, పోట్లాడే ఓపికలేక. "జరిమానాతోసహా ముప్పైఆరూ కట్టకపోతే మాత్రం మీరు సికింద్రాబాద్ స్టేషన్‌లోంచి బయటికి అడుగు పెట్టలేరు. రేపు వుదయం కోర్టులో మీరు మేజిస్ట్రేట్‌కి చెప్పుకుందురుగాని" అని ఆగి అన్నాడు కాస్త గట్టిగా "అయిదువందల జరిమానా లేదా మూడు నెలల జైలు. లేదా రెండూ. మెజిస్ట్రేట్‌నిబట్టి వుంటుంది తీర్పు."

"పోతేపోయింది కట్టేయండి పాడుడబ్బు లేచి ఎవరి వెధవమొహం చూసామోకాని..." ఆ ఆసామి భార్య భర్తకి సలహా ఇచ్చింది.

"ఇటీజ్ అబ్సర్డ్. ఐ కాంట్ టాలరేట్ సచ్ ఏ..." గట్టిగా ఇంగ్లీష్‌లో ఏదో చెప్పబోయాడు ఆ ఆసామి.

"డబ్బు కడతారా, కట్టరా?" విసుగ్గా అడిగాడు సూర్యం, రైలువేగం తగ్గడం గమనించి.

అంతదాకా మౌనంగా వున్న ఆ ఆసామి కొడుకు తన జేబులోంచి డబ్బుతీసి సూర్యానికి అందించి అన్నాడు. "మీపని కానివ్వండి. పొరపాటు మాదయినప్పుడు ఏంచేస్తాం?"

సూర్యం డబ్బు అందుకుని రసీదు రాసిచ్చాడు ఆముసలాయన కొడుక్కి.

"ఈ రసీదు పారేయకండి మళ్లీ" అన్నాడు కనీ కనబడకుండా నవ్వి.

రైలు మెహబూబాబాద్‌లో ఆగింది. వర్ధనమ్మతో, తను వరంగల్ స్టేషన్‌లో కలుస్తాననిచెప్పి, ఆకంపార్ట్‌మెంట్‌లోంచిదిగి, ప్రక్క కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కాడుసూర్యం స్టేషన్ కాంటీన్‌లో టీ తాగి.

రైలు బయలుదేరింది మళ్లీ!

రైలు వరంగల్ స్టేషన్‌లో ఆగాక సూర్యం చెప్పాడు వర్ధనమ్మ ఎక్కివున్న కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చి.

"ఇక్కడ మూడే మూడు నిముషాలు ఆగుతుంది. త్వరగా దిగండి"

తనే సహాయం చేసాడు దిగడానికి. వర్ధనమ్మ రేకు పెట్టెని తనే పట్టుకుని నడుస్తూ అన్నాడు.

"నాకు చాలా బాధగా వుందండి. మొగదిక్కు లేకపోతే కష్టం, ఈ కాలంలో ఆడవాళ్లకి. అందరికీ అలుసే మీలాంటి వాళ్లంటే"

ఆవిడ నిశ్శబ్దంగా కళ్ళొత్తుకుంది. తన

డా॥ సి.వి.కె. రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్

వైద్యవిద్వాన్ — వైద్యాచార్య
హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్రస్ఖలనము, శుక్లనష్టము, సుఖరోగములకు, మానసిక వ్యాధులకు శాస్త్రీయ చికిత్స, విదేశయంత్రముతో ప్రత్యేక చికిత్స, పోస్టుద్వారా కూడా చికిత్స గలదు.
రావూస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700
SUVARNA

REGD.
'వాడండి ముఖ్యంగా అలస్యమైన,
క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన,
లేక ఆగిపోయినబహిష్టుకు
SEALED PACKING, 28 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
MFRS: SEENU & CO., MADRAS-21

WHEN NATURE FAILS
New Super Height మరింతఎత్తు, పొడుగు కాగలరు (2నుండి 8అం. వరకు పూచీ)
For Super Heightness మీరు పొడుగు పెరగ దలచుకుంటే ప్రపంచప్రఖ్యాతి పొందిన మా హైటెక్స్ HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితిలేదు. స్త్రీలు, పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great name and meant for popular people. వెల: బుడ్డి 1 కి (20 Tabs) Rs. 3-75. పోస్టేజి అదనం. 3 Phails (60 Tabs) Rs. 11-25. Postage free.
SCIENCE HAS SOLVED THE PROBLEMS
STOP GREY HAIR పిన్నవారుగా అగుపించండి. మీరు పిన్నవారైనట్లే మీకుఅనిపిస్తుంది. (Feel) Unobtainable anywhere else in the world. సంవత్సరాలుగా జరిపిన పరిశోధన ఫలితమైన బాల్ కాలా తేల్ BAL KALA TEL Brilliantine Hair Colour అద్భుతముగ తెల్లజుట్టును శాశ్వతంగా వేళ్ళనుంచి నల్లబడేట్లు చేస్తుంది. వెల: బుడ్డి 1కి Rs. 3 only. పోస్టేజి అదనం. 3బుడ్లు Rs. 7-50 పోస్టేజి ఉచితం. తల తెల్లగాగాని, రంగువేసినట్లుగాని అనిపించదు. షరా: ఉత్తరాలు ఇంగ్లీషులో వ్రాయండి.
M/S. VICTORIA COMMERCIAL COY,
A.M.W. (2/75) Flat Door No. 3383X,
Beat No. 1, Ambala Cantt-133001 (N.I.)

# జ రి మా నా

కోడలిని తలచుకునో, తన నిస్సహాయతకో, లేక పొందుతున్న సహాయం వల్ల ఏర్పడ్డ కృతజ్ఞతకో తెలియలేదు సూర్యానికి. ఆవిడ కళ్ళలో నీళ్లు తళుక్కుమనటం మాత్రం గమనించాడు.

"నీకు తెలిసినవాళ్లు ఎవరయినా వున్నారా? ఇబ్బందేం వుండదుగా?" అడిగింది వర్ధనమ్మ సూర్యాన్ని, గేటుదగ్గిరవగానే.

"టిక్కెట్ వుంది. మిమ్మల్ని ఎవరూ ఏమీ అడగరు."

సూర్యం తన జేబులోంచి, సికింద్రాబాద్ దాకా కొన్న ఇరవై అరురూపాయల చిల్లర కిమ్మత్తు చేసే టిక్కెట్‌ని, బయటకి తీసి అందించాడు వర్ధనమ్మకి.

"టిక్కెట్ ఎక్కడిది? కొన్నావా బాబూ?" అడిగింది కృతజ్ఞత నిండిన కంఠంతో.

"కొనలేదు. మీ పాత బాకీ కొద్దిగా వసూలు చేసానంతే" నవ్వాడు సూర్యం.

"పాత బాకీయా?" అడిగింది ఆశ్చర్యంగా. "మీ నాన్న నెల నెలా అద్దె సరిగ్గానే ఇచ్చేవాడేగా?"

"మాదికాదు. మరొకరి అద్దె."

"ఇంకెవరు?"

"ఘనాపాటి"

"ఘనాపాటి?"

"అవును."

"నీ కెక్కడ కనపడ్డాడు?"

"మీరు ఎక్కివస్తున్న పెట్టెలోనే భార్య, ఇద్దరు కొడుకులతో వస్తున్నాడు, చాలా దూరం నుంచి. చూడగానే గుర్తుపట్టగలిగాను, మీకు రెండువందల చిల్లరదాకా ఇవ్వాల్సినా, ఈ కాస్తే వసూలు చేయగలిగాను" అన్నాడు గర్వంగా నవ్వి.

"ఇచ్చాడా గొడవచేయకుండా?" వర్ధనమ్మ నమ్మలేనట్టుగా అడిగింది.

"కాలం, నా వుద్యోగం, అవకాశం అన్నీ కలిసివచ్చాక ఇవ్వక ఏంచేస్తాడు? అంతేకాదు. మీకు డబ్బు ఎగ్గొట్టడంవల్ల చిన్న జరిమానా కూడా వేసాను."

వర్ధనమ్మ గేటులోంచి బయటకి వెళ్ళాక, తిరిగి మళ్లా బయలుదేరబోతున్న రైలువైపు నడుస్తున్న సూర్యాన్ని చూసి, తండ్రితో అన్నాడు ఘనాపాటి కొడుకు సంభ్రమంగా.

"నాన్నా మనదగ్గర డబ్బు వసూలుచేసిన టి. సి. సూరిగాడులా వున్నాడు చూడు. నడక చూస్తే అలాగేవుంది అచ్చం."

సరిగ్గా అదే సమయంలో అనుకున్నాడు సూర్యం.

'ఏ న్యాయాధికారి మాత్రం వర్ధనమ్మకి ఇంతకంటే ఎక్కువ న్యాయం చేయగలడు? ఘనాపాటికి ఇంతకంటె ఎక్కువ జరిమానా వేయగలడు?'

దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత-డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17



లివెన్సా
వాడండి